క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



మృతురాలి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో ఇంజమూరి చిన్న అంజమ్మ మంగళవారం మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు, గ్రామ కాంగ్రెస్ నాయకులు రూ.8వేల నగదును మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ తైదా పర్వతాలు, కోడూరు రాములు, శ్రీశైలం, నాగిరెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న కాలనీవాసులు

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో మంగళవారం కాలనీ నూతన అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా జమాల్‌పూర్ చందులాల్, ప్రధాన కార్యదర్శిగా చౌలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, న్యాయ సలహాదారుడిగా శ్యాంసుందర్‌లు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, రాజు, బ్రహ్మచారి, భూషణ్, ఈశ్వరయ్య, పాపిరెడ్డి, యాదయ్య, యాదగిరిచారి, మురళీ, వర్కాల బాలు, వరప్రసాద్, మనోజ్, నర్సింలు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్మిత సబర్వాల్‌పై ఫిర్యాదు

షాద్‌నగర్: దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం దివ్యాంగులు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగుల సంఘం నాయకులు ఎస్ఐ శరత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భుజంగరెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఆమె వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు వెంటనే ఆమెపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు

మొయినాబాద్‌రూరల్: పార్టీ కోసం కష్టపడి గ్రామస్థాయి నుంచి పనిచేసిన వారిని పార్టీ అధిష్టానం ఎన్నడు మరవదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ పార్టీ కార్యాలయంలో అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన అంతంగారి నర్సింగ్‌రావుకు బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా నియమించిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు చెనివెళ్ల ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా రవీందర్



బాధ్యతలు స్వీకరిస్తున్న బి.రవీందర్



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేశ్

చేవెళ్ల: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా శంకర్‌పల్లి మండలం బీ.రవీందర్ వచ్చారు. మొయినాబాద్ మండలంలో పనిచేస్తున్న సీహెచ్.రమేశ్ చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వచ్చారు. వీరు ఇరువురు చేవెళ్లలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హిమబిందు వారికి స్వాగతం తెలిపారు. బాధ్యతలను అప్పగించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా




బాధ్యతలు స్వీకరిస్తున్న జీ.శారద

షాబాద్: ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామని షాబాద్ సూపరింటెండెంట్ జీ.శారద పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన విజయలక్ష్మి అబ్దుల్లాపూర్‌మెంట్‌కు బదిలీపై వెళ్లారు. ఫరూఖ్‌నగర్ మండలంలో పని చేసిన శారద షాబాద్‌కు బదిలీపై వచ్చారు.

ఏళ్ల నిరీక్షణకు తెర

- కూడళ్లలో వంతెనలు నిర్మించేందుకు సిద్ధం
- ఎమ్మెల్యే అభ్యర్థనకు ఎన్‌హెచ్‌ఏఐ ఆమోదం
- సంతోషం వ్యక్తం చేస్తున్న కొత్తూరు వాసులు



వైజంక్షన్ కూడలి

కొత్తూరు: కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు ఉన్న 18 కిలోమీటర్ల బైపాస్ రోడ్డుపై వంతెనలు, అండర్ పాస్‌లు నిర్మించేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అంగీకరించింది. కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు బైపాస్ రోడ్డును 2009లో ఏర్పాటు చేశారు. అప్పట్లో స్థానికులు, ప్రజాప్రతినిధుల సూచన మేరకు కూడళ్లలో అండర్ పాస్, వంతెనలు నిర్మించలేదు. దీంతో క్రమంగా రోడ్డుపై వాహనాల రాకపోకలు పెరగడంతో కూడళ్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోవడం ప్రారంభమైంది. ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు, పోలీసులు తాత్కాలికంగా కొన్ని కూడళ్లను మూసివేశారు. దీంతో బైపాస్ రోడ్డుకు సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు కూడళ్లు దాటడానికి తీవ్ర ఇబ్బందిపడ్డారు. ఈ నేపథ్యంలో గత నెల 24న స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న పలు కూడళ్లలో ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఏఐ పీడీ నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ అధికారులు మంగళవారం ఎమ్మెల్యే వినతిపత్రానికి ప్రతిస్పందనగా ఆయనకు లేఖను పంపారు. కొన్నేళ్ల నిరీక్షణకు తెర పడనుండడంతో కొత్తూరు పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కూడళ్లు దాటే సమయంలో తమ సమస్యలను విన్నవించిన వెంటనే ఆయన స్పందించడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వంతెనల నిర్మాణాలపై హర్షం

కూడళ్లలో ప్రమాదాల నివారణకు అధికారులు వంతెనలు నిర్మించనుండడంతో స్థానికులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరలో పనులు చేపట్టి పూర్తిచేసే విధంగా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని వారు కోరుతున్నారు.



అధికారులు పంపిన రిప్లై లెటర్

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే వై జంక్షన్, పెంజర్ల, జేపీదర్గా, నందిగామ కూడళ్లలో వంతెనల నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ఈ మేరకు తాము ఇదివరకే ఇచ్చిన వినతికి ప్రతిస్పందనగా మరో లేఖను రాశారు. మరోమారు అధికారులను కలిసి వంతెన నిర్మాణాలపై చర్చిస్తాం. కూడళ్లలో ఎక్కడ ప్రమాదాలు జరగకుండా అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం.
– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం



దివ్యాంగులకు బస్‌పాసులను అందిస్తున్న విశాల

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తోందని మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 400 మంది దివ్యాంగులకు మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఉచిత బస్ పాసులను మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సహకారంతో దివ్యాంగులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివయ్య, దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలు యాదమ్మ, వీహెచ్‌ఎస్ మండల అధ్యక్షుడు సూరమోని యాదయ్య, టీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ 1 డిపో పీహెచ్‌సీ శ్రీరామ్, మమత, యాదయ్య, నర్సింలు, లక్ష్మయ్య, కృష్ణయ్య, సత్యనారాయణరెడ్డి, యాదయ్య, రాంచందర్, శంకర్, బిక్షపతి, రత్నయ్య పాల్గొన్నారు.

శిథిల ఇళ్లల్లో ఉండొద్దు



తండావాసులను సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని చెబుతున్న అశోక్

షాబాద్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోతుగల్ పంచాయతీ కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ తండాలో ఆయన పర్యటించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ప్రజలు ఉండొద్దని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. లేకుంటే ఆశ్రమం కోసం గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి వచ్చి ఉండాలని తండా వాసులకు సూచించారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



శంకర్‌పల్లి: ఆలయంలో పూజలు చేస్తున్న కౌన్సిలర్లు లక్ష్మమ్మ, శ్వేత

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్‌లో మంగళవారం బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కౌన్సిలర్లు లక్ష్మమ్మరాంరెడ్డి, శ్వేతాపాండురంగారెడ్డిలు బోనాలు చేసి, కాళిమాత ఆలయంలో సమర్పించారు. మున్సిపాలిటీ ప్రజలు ఎల్లప్పుడూ సంతోషంగా జీవించాలని ఈ సందర్భంగా కౌన్సిలర్లు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, అరుణోదయ సంఘం అధ్యక్షుడు పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందనవెల్లిలో..

షాబాద్: మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో మంగళవారం బోనాలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు



మల్లికార్జున ఖర్గేను కలిసిన పామెన జ్యోతి భీంభరత్

షాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడి నివాసంలో ఆయనను కలిసి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాలని కోరానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఖర్గే సూచించినట్లు ఆమె తెలిపారు. పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు కచ్చితంగా ఉంటాయన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కేరింతలు కొడుతున్న పూర్వ విద్యార్థులు

మొయినాబాద్: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీహెచ్ పాఠశాలలో 2007–08 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరూ మంగళవారం సురంగల్‌లోని ఓ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అందరూ ఒకచోట చేరి ఒకరికొకరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

బోరుమోటార్ ప్రారంభం

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి సొంతత నిధులతో ఏర్పాటు చేసిన బోరుమోటార్‌ను మంగళవారం గ్రామ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రవీందర్ రెడ్డి, యాదయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బోరుమోటార్ ప్రారంభిస్తున్న నాయకులు, పాఠశాల సిబ్బంది

కుక్కలొచ్చాయి.. జాగ్రత్త!

- నందిగామలో అర్ధరాత్రి శునకాలను వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- భయాందోళనలో గ్రామస్తులు
- బెడదను అరికట్టాలని డిమాండ్



నందిగామలో సోమవారం అర్ధరాత్రి వదిలివెళ్లిన వీధి కుక్కలు

నందిగామ: వీధి కుక్కలు అంటేనే భయపడే ప్రస్తుత పరిస్థితుల్లో అర్ధరాత్రి వేళ కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 50 వీధి కుక్కలను వదిలివెళ్లారు. ఈ సంఘటన మండల కేంద్రమైన నందిగామలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

సుమారు 50పైగా..

మండల కేంద్రమైన నందిగామలో సోమవారం అర్ధరాత్రి వేళ షాద్‌నగర్ వైపు నుంచి వచ్చిన ఓ వాహనంలో గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 50 కుక్కలను స్థానిక విక్టరీ గ్రౌండ్‌లో వదిలివెళ్లారు. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే గ్రామంలో వందలాది వీధి కుక్కలు ఉన్నాయని, వాటితోనే తాము ఇబ్బందులు పడుతుండగా ఎక్కడి నుంచో తీసుకొచ్చి మా గ్రామంలో వదిలివెళ్లడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. గతంలో సైతం బైపాస్ రోడ్డు పక్కన హైదరాబాద్‌వైపు నుంచి వచ్చిన వాహనంలో కుక్కలను వదిలివెళ్లారని ఆరోపించారు.

వీధుల్లో స్వైర విహారం

గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, వ్యవసాయ పొలాల వద్ద పశువులను చంపేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామంలో ఎంతో మందిని కాటు వేశాయని ఆరోపించారు. దీంతో చిన్నపిల్లలు పాఠశాలలకు, బయటకు వెళ్లాలన్నా భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కలను వదిలివెళ్లిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా గ్రామంలో ఉన్న వీధి కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీడీఓ సంధ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న అధికారులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా వచ్చిన అధికారులు బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన సులోచన కందుకూరుకు బదిలీకాగా ఆమె స్థానంలో కందుకూరు నుంచి అత్తాపూర్ రెహమాన్ వచ్చారు. అదే విధంగా మండల సీనియర్ అసిస్టెంట్ రమేశ్ చేవెళ్లకు బదిలీకాగా ఆయన స్థానంలో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి రమాదేవి వచ్చారు. మండల టైపిస్ట్ లక్ష్మి చేవెళ్లకు బదిలీకాగా శంకర్‌పల్లి మండలం నుంచి నర్సింహా మండలానికి వచ్చారు. పంచాయతీరాజ్ ఏఈ ఖాళీగా ఉన్న స్థానంలో జి.సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి అధికారులతో ముఖాముఖి నిర్వహించి మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ప్రజలతో కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘చలో అసెంబ్లీ’ని విజయవంతం చేయండి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి



లేబర్ అడ్డా వద్ద కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

చేవెళ్ల: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, కార్యదర్శి వి.సత్యనారాయణలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని లేబర్ అడ్డా వద్ద మంగళవారం భవన నిర్మాణ రంగ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, తంబ్ విధానం రద్దు చేయాలని కోరారు. ఈనెల 26వ తేదీ ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దీంతో పాటు చలో అసెంబ్లీ కార్యక్రమం ఉంటుందని దీనిని విజయవంతం చేయాలన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఈ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వీరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ అడ్డాల దగ్గర కార్మికులకు కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు వడ్ల మంజుల, శివ, రాంచందర్, మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



హెచ్‌ఎంలను సన్మానిస్తున్న మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: సమాజంలో ఇప్పటికీ, ఎప్పటికీ ఉపాధ్యాయ వృత్తికి గౌరవం ఉంటుందని మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మక్తగూడ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన హెచ్‌ఎం మేఖలరెడ్డి వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయనతో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు నూతనంగా వచ్చిన హెచ్‌ఎం, బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎంలను శాలువాలతో సన్మానించారు. అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు తమకు ఉన్న సౌకర్యాలు, వసతులను సద్వినియోగం చేసుకొని చదువుల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాట్న రాజు, రాందాస్‌నాయక్, దయానంద్‌గుప్తా, మోడి దర్శన్, రాములు, రాజు, శేఖర్, భరత్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ మహేందర్‌రెడ్డి



సభ్యత్వ నమోదు చేపడుతున్న మహేందర్‌రెడ్డి

షాబాద్: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ, తాళ్లపల్లి, షాబాద్, హైతాబాద్, తిమ్మారెడ్డిగూడ, చందనవెల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో ఏకీకృత సర్వీసులు సాధిస్తామని, ఉపాధ్యాయులకు ఎంఈఓలు, జేఎల్, డైట్ లెక్చరర్లుగా ప్రమోషన్ ఇప్పిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 5డీఏలను, 50 శాతం ఫిట్‌మెంట్ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో షాబాద్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణ, శేరిలింగంపల్లి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు దేవిడ్‌రెడ్డి, నర్సింలు, అనంతరెడ్డి ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. అన్నదాతలకు నష్టం



పొలంలో చేరిన మురుగు నీరు

- అసంపూర్తి పనులతో కాల్వకు గండి
- మురికి కూపాలుగా మారిన పొలాలు

శంకర్‌పల్లి: మండలంలోని మోకిల గ్రామంలో నీటి పారుదల అధికారులు చేపట్టిన అసంపూర్తి పనుల కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. రెండునెలల క్రితం మోకిల గ్రామం నుంచి జన్వాడ వరకు వెళ్తున్న ఫిరంగి నాలా పూడికతీత పనులను నీటి పారుదల అధికారులు చేపట్టారు. పూడికతీసే సమయంలో స్థానిక రైతులకు సమాచారం ఇవ్వకుండా, రియల్టర్లకు అనుకూలంగా సర్వే చేపట్టకుండా పనులను ప్రారంభించారు. చేసిన పనులను పలు కారణాలతో అక్కడక్కడ వదిలేయడం.. వరద ప్రవాహానికి వీలు లేకుండా మధ్య మధ్యలో కట్టలు వేయడంతో సమస్య ఉత్పన్నమైంది. గత మూడు నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మధ్యలో కట్టలు ఉన్న కారణంగా వర్షం నీరు, మోకిల గ్రామంతో పాటు చుట్టు పక్క విల్లాలు, అపార్టుమెంటులోని మురుగునీరు ఈ కాల్వగుండానే ప్రవహిస్తోంది. ఇటీవల రైతులు పొలంలో వరి నాట్లు వేయగా.. కాల్వ గండి కారణంగా పొలంలోని వరినాట్లు అన్నిపోగా.. పొలం అంతా మురుగునీటి కూపంగా తయారైంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. కాల్వ గండి పడడంపై మండల నీటి పారుదల అధికారి రాధికను వివరణ కోరగా.. పూడికతీసే సమయంలో రైతులు మట్టి తీయనివ్వలేదని, అందువల్లనే ఆ ప్రాంతంలో గండి పడినట్లు ఆమె స్పష్టం చేశారు.



కాల్వకు పడిన గండి



మురుగునీటితో నిండిన పొలాలు